www.aksharadarbar.com
శనివారం 22, జూన్ 2024
# అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :120 | పేజీలు : 04 | వెల : 05

## క్యాన్సర్ వైద్యానికి రూ.15 లక్షలు

- అమల్లోకి కేంద్ర ప్రభుత్వం పథకం
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్
- వైద్య, ఆరోగ్య, గిరిజన హాస్టల్స్ అంశాలపై సమీక్ష

03

తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దూకుడు పెంచింది. వరుస దాడులు, తనిఖీలు, ఆకస్మిక ఆపరేషన్లతో ఏసీబీ అధికారులు హల్ చల్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక ఏసీబీ డీజీగా సీవీ ఆనంద్ కు బాధ్యతలు అప్పగించింది. ఆయన కిందిస్థాయి అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతో క్షేత్రస్థాయిలోని అవినీతి అధికారుల భరతం పడుతున్నారు. గతంలో ఏసీబీ అధికారులను సంప్రదించేందుకు కేవలం 1064 టోల్ ఫ్రీ నెంబర్ మాత్రమే అందుబాటులో ఉండేది. ఇటీవల ప్రజలకు మరింత చేరువయ్యేలా ఏసీబీ సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటోంది. 9440446106 వాట్సప్ నెంబర్ అందుబాటులోకి తెచ్చిన తర్వాత ఫిర్యాదుల సంఖ్య మరింత పెరిగింది. కిందటి ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం (జూన్ వరకే) అత్యధిక కేసులు నమోదయ్యాయి. కాగా అన్ని శాఖల అధికారులను హడలెత్తించే ఏసీబీ పోలీసుల విషయంలో మెతక వైఖరి అవలంభిస్తోందన్న అపవాదు గతంలో ఉండేది. కానీ ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలు దీన్ని పటాపంచలు చేస్తున్నాయి. తాజాగా ఎస్సైలు, సీఐలు, ఏసీపీ స్థాయి అధికారులను ఏసీబీ వల పన్ని పట్టుకుంటోంది. ఎన్నడూలేని విధంగా పోలీస్ శాఖపై ఏసీబీ ఫోకస్ మరింత పెంచిందని ఇటీవల జరుగుతున్న ఘటనలు రుజువు చేస్తున్నాయి.

–అక్షర దర్బార్, ప్రత్యేక ప్రతినిధి

02

- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ , రవాణా శాఖలపై మేజర్ గురి
- పోలీస్ శాఖను పట్టించుకోరన్న టాక్
- అపవాదును పటాపంచలు చేస్తున్న తాజా దాడులు
- అవినీతి నిరోధక శాఖ ఉచ్చులో పోలీసులు
- నెల రోజుల వ్యవధిలోనే ముగ్గురు సీఐలు, ఇద్దరు ఇన్ స్పెక్టర్లు ట్రాప్
- నిన్న సూరారం సీఐ, నేడు రాయికల్ ఎస్సై అడ్డంగా బుక్

# ఏసీబీ దూకుడు

వరుస దాడులతో లంచావతారాల్లో వణుకు

## మహాదేవపూర్ సీఐపై వేటు

- సర్కిల్ ఇన్ స్పెక్టర్ రాజేశ్వర్ రావు బదిలీ
- ఐజీ ఆఫీసులో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు
- కాళేశ్వరం ఘటన ఎఫెక్ట్
- మల్టీ జోన్-1 లో 19 మంది సీఐల బదిలీ

ఊహించినట్లుగానే భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ బి రాజేశ్వర్ రావుపై వేటు పడింది. ఆయనను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రాజేశ్వర్ రావు సహా మల్టీజోన్ -1లో 19 మంది ఇన్ స్పెక్టర్లను బదిలీ చేస్తూ మల్టీ జోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. కొద్ది రోజుల క్రితం మహాదేవపూర్ సర్కిల్ పరిధిలోని కాళేశ్వరం పోలీసు స్టేషన్ లో పనిచేసిన సబ్ ఇన్ స్పెక్టర్ భవాని సేన్ మహిళా కానిస్టేబుల్ పై లైంగిక దాడి జరపడం, తమ దృష్టికి రావడంతో పోలీసు శాఖ ఉన్నతాధికారులు రంగంలోకి దిగి జరిపిన విచారణలో సబ్ ఇన్ స్పెక్టర్ ముగ్గురు మహిళ కానిస్టేబుళ్లను వేధింపులకు గురిచేసినట్లు తేలటం, భవాని సేన్ ను అరెస్టు చేసి పోలీసులు హాజరపరచగా ప్రభుత్వం సబ్ ఇన్ స్పెక్టర్ భవాని సేన్ ను సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగించిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఘటన సంచలనం రేపింది. తన సర్కిల్ పరిధిలోని గల కాళేశ్వరం పోలీస్ స్టేషన్ లో సబ్ ఇన్ స్పెక్టర్ భవాని సేన్ మహిళా కానిస్టేబుళ్లను వేధింపులకు గురి చేయడం, బెదిరించి ఒక మహిళ కానిస్టేబుల్ పై అత్యాచారం జరపడం వంటివి చోటు చేసుకున్న విషయంలో మహాదేవపూర్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ రాజేశ్వర్ అలసత్వం ఉందని, ఈ క్రమంలో ఆయన పనితీరునూ పోలీసు శాఖ ఉన్నతాధికారులు తప్పు పట్టినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సర్కిల్ ఇన్ స్పెక్టర్ రాజేశ్వర్ రావు పై బదిలీ వేటు పడే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో రాజేశ్వర్ రావు బదిలీ జరగడం చర్చనీయాంశమైంది.

–అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

## కళ్ల గంతలు కట్టుకొని వైద్య విద్యార్థుల నిరసన

- కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలు
- 24 నుంచి సమ్మెకు సిద్ధం

02

## రాష్ట్రంలో ఎకో టూరిజం ప్రణాళిక

- పర్యావరణం, వన్య ప్రాణులకు హాని లేకుండా రూపకల్పన
- ఇప్పటికే 40 ఎకో టూరిజం స్పాట్ల గుర్తింపు
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

04

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

# ఏసీబీ దూకుడు..!

- వరుస దాడులతో లంచావతారాల్లో వణుకు
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్, రవాణా శాఖలపై మేజర్ గురి
- పోలీస్ శాఖను పట్టించుకోరన్న టాక్
- అపవాదును పటాపంచలు చేస్తున్న తాజా దాడులు
- అవినీతి నిరోధక శాఖ ఉచ్చులో పోలీసులు
- నెల రోజుల వ్యవధిలోనే ముగ్గురు సీఐలు, ఇద్దరు ఇన్ స్పెక్టర్లు ట్రాప్
- నిన్న సూరారం సీఐ, నేడు రాయికల్ ఎస్సై అడ్డంగా బుక్

**అక్షర దర్బార్, ప్రత్యేక ప్రతినిధి:**

తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దూకుడు పెంచింది. వరుస దాడులు, తనిఖీలు, ఆకస్మిక ఆపరేషన్లతో ఏసీబీ అధికారులు హల్ చల్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక ఏసీబీ డీజీగా సీవీ ఆనంద్‌కు బాధ్యతలు అప్పగించింది. ఆయన కిందిస్థాయి అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతో క్షేత్రస్థాయిలోని అవినీతి అధికారుల భారతం పడుతున్నారు. గతంలో ఏసీబీ అధికారులను సంప్రదించేందుకు కేవలం 1064 టోల్ ఫ్రీ నెంబర్ మాత్రమే అందుబాటులో ఉండేది. ఇటీవల ప్రజలకు మరింత చేరువయ్యేలా ఏసీబీ సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటోంది. 94404 46106 వాట్సప్ నెంబర్ అందుబాటులోకి తెచ్చిన తర్వాత ఫిర్యాదుల సంఖ్య మరింత పెరిగింది. కిందటి ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం (జూన్ వరకే) అత్యధిక కేసులు నమోదయ్యాయి. కాగా, అన్ని శాఖల అధికారులను హడలెత్తించే ఏసీబీ పోలీసుల విషయంలో మెతక వైఖరి అవలంభిస్తోందన్న అపవాదు గతంలో ఉండేది. కానీ ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలు దీన్ని పటాపంచలు చేస్తున్నాయి. తాజాగా ఎస్సైలు, సీఐలు, ఏసీపీ స్థాయి అధికారులను ఏసీబీ వలపన్ని పట్టుకుంటోంది. ఎన్నడూలేని విధంగా పోలీస్ శాఖపై ఏసీబీ ఫోకస్ మరింత పెంచిందని ఇటీవల జరుగుతున్న ఘటనలు రుజువు చేస్తున్నాయి.

## కుషాయిగూడలో సీఐ, ఎస్సై అరెస్టు..

ఓ స్థలం వివాదానికి సంబంధించి నమోదైన కేసును మూసివేయడానికి రూ. 3 లక్షల లంచం తీసుకుంటూ గత నెల 31న కుషాయిగూడ సీఐ, ఎస్ఐతోపాటు మరో మధ్యవర్తి ఏసీబీకి దొరికిపోయారు. కుషాయిగూడ ఇన్స్పెక్టర్ జి వీరస్వామి, ఎస్సై షేక్ షఫీతోపాటు మధ్యవర్తిత్వం నడిపిన ఉపేందర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. కుషాయిగూడలో ఓ స్థలానికి సంబంధించి మహిళకు స్థానికంగా నివాసం ఉండే భరత్ రెడ్డికి వివాదం నడుస్తోంది. సోదరు మహిళ ఫిర్యాదు మేరకు భరత్ రెడ్డిపై ఏప్రిల్లో కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. తనపై పోలీసులు అన్యాయంగా కేసు నమోదు చేశారని భరత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు నోటీస్ ఇచ్చారు. ఆ తర్వాత కేసు మూసివేయడానికి రూ.3 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. పోలీస్ స్టేషన్లో లంచం ఇస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## సూరారం సీఐ వెంకటేశం..

మేడ్చల్ జిల్లా సూరారం సీఐ ఆకుల వెంకటేశం రూ. లక్ష తీసుకుంటూ ఈనెల 21న ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి చెందిన భూమిలో అభివృద్ధి పనుల కోసం సీఐ రూ. 5 లక్షల డిమాండ్ చేశారు. అందులో భాగంగా ఈనెల 21న సదరు వ్యక్తి రూ.లక్ష లంచం ఇస్తుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెట్‌గా పట్టుకున్నారు. సీఐ ఆకుల వెంకటేశం నుంచి నగదు స్వాధీనం చేసుకొని ఆయన్ను కోర్టులో హాజరుపర్చారు.

## సీసీఎస్ సీఐ సుధాకర్..

రూ.3 లక్షలు లంచం తీసుకుంటుండగా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈనెల 13న హైదరాబాద్‌లో ఈ ఘటన జరిగింది. వివాదంలో ఉన్న ఇంటి పత్రాలు ఇవ్వడానికి బాధితుడి నుంచి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రూ.15 లక్షలు డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు మొదటి విడతలో రూ.5 లక్షలు చెల్లించాడు. రెండో విడతలో భాగంగా ఈనెల 13న రూ.3 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్న బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

## రాయికల్ ఎస్సై అజయ్..

జగిత్యాల జిల్లా రాయికల్ పోలీస్ స్టేషన్లో నిన్న ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి పట్టుకున్న ఓ ట్రాక్టర్ రిలీజ్ విజయంలో యజమానులను ఎస్సై అజయ్ డబ్బులు డిమాండ్ చేశారు. ఇందుకోసం ఓ మధ్యవర్తి ద్వారా రూ. 25 వేలకు బేరం కుదిరింది. అయితే బాధితులు ఏసీబీని ఆశ్రయించగా ఎస్సైని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు వ్యూహం పన్నారు. అందులో భాగంగా మీడియేటర్ ద్వారా రూ. 25వేలు ఇచ్చేందుకు అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఠానాకు వెళ్లారు. అయితే బయట వాహనాలు గమనించిన ఎస్సై అజయ్ డబ్బులు అక్కడే వదిలేసి పరారయ్యాడు. అతడి కోసం ఏసీబీ అధికారులు గాలిస్తున్నారు.

నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు

# కళ్లకు గంతలు కట్టుకొని వైద్య విద్యార్థుల నిరసన

- కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలు
- 24 నుంచి సమ్మెకు సిద్ధం

అక్షర దర్బార్, హనుమకొండ: ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ హనుమకొండ కాకతీయ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు, జూడాలు చేపట్టిన ఆందోళన కార్యక్రమం శనివారం మూడో రోజుకు చేరింది. ఇందులో భాగంగా మూడో రోజు వైద్య విద్యార్థులు, జూడాలు కళ్ల గంతలు కట్టుకుని తమ నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను, సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. శనివారం కేఎంసీలో డ్యూటీకి వెళ్లే సమయంలో దెబ్బతిన్న రోడ్ల వల్ల పీజీ విద్యార్థిని ప్రమాదానికి గురై తీవ్ర గాయాల పాలైందని తెలిపారు. ముందుగానే ఇలాంటి సమస్యలను తెలియజేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వెలిబుచ్చారు. ఈ నెల 24 నుంచి సమ్మె బాట పడుతున్న విషయాన్ని కేఎంసి వైద్య విద్యార్థులు, జూడాలు గుర్తు చేశారు. స్టైఫండ్ సకాలంలో విడుదలకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు, కాకతీయ వైద్య కళాశాలలో రోడ్ల నిర్మాణం, డాక్టర్ల కోసం కొత్త హాస్టల్ భవనాల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యలపై పలు మార్లు ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ స్పందన లేకపోవడంతో సమ్మెకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. సంబంధిత అధికారుల నుంచి ఆశించిన చర్యలు లేకపోవడంతో సమ్మె తప్ప మరో మార్గం లేకుండా పోయిందని స్పష్టం చేస్తున్నట్లు చెప్పారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాడుతామని తెలిపారు.

# మహాదేవపూర్ సీఐపై వేటు

- సర్కిల్ ఇన్ స్పెక్టర్ రాజేశ్వర్ రావు బదిలీ
- ఐజీ ఆఫీసులో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు
- కాళేశ్వరం ఘటన ఎఫెక్ట్
- మల్టీ జోన్-1 లో 19 మంది సీఐల బదిలీ

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: ఊహించినట్లుగానే భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ బి.రాజేశ్వర్ రావుపై వేటు పడింది. ఆయనను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రాజేశ్వర్ రావు సహా మల్టీజోన్ –1లో 19 మంది ఇన్ స్పెక్టర్లను బదిలీ చేస్తూ మల్టీ జోన్–1 ఐజీ ఏవీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. కొద్ది రోజుల క్రితం మహాదేవపూర్ సర్కిల్ పరిధిలోని కాళేశ్వరం పోలీసు స్టేషన్ లో పనిచేసిన సబ్ ఇన్ స్పెక్టర్ భవాని సేన్ మహిళా కానిస్టేబుల్ పై లైంగిక దాడి ఘటనపై విచారణలో సబ్ ఇన్ స్పెక్టర్ ముగ్గురు మహిళ కానిస్టేబుళ్లను వేధింపులకు గురిచేసినట్లు తేలడంతో భవానీ సేన్ ను సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగించిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఘటన సంచలనం రేపింది. తన సర్కిల్ పరిధిలోని గల కాళేశ్వరం పోలీస్ స్టేషన్ లో సబ్ ఇన్ స్పెక్టర్ భవాని సేన్ మహిళా కానిస్టేబుళ్లను వేధింపులకు గురి చేయడం, బెదిరించి ఒక మహిళ కానిస్టేబుల్ పై అత్యాచారం జరపడం వంటివి చోటు చేసుకున్న విషయంలో మహాదేవపూర్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ రాజేశ్వర్ అలసత్వం ఉందని, ఈ క్రమంలో ఆయన పనితీరునూ పోలీసు శాఖ ఉన్నతాధికారులు తప్పు పట్టినట్లు తెలిసింది. దీనికి తోడు మహాదేవపూర్ సర్కిల్ పరిధిలో జరిగిన కొన్ని సంఘటనల పట్ల సీఐ పర్యవేక్షణ లోపం ఉందని ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సర్కిల్ ఇన్ స్పెక్టర్ రాజేశ్వర్ రావుపై బదిలీ వేటు పడే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో రాజేశ్వర్ రావు బదిలీ జరగడం ఆసక్తికర చర్చనీయాంశమైంది. ఆయనతో సహా మల్టీజోన్ –1 పరిధిలో 19మంది ఇన్ స్పెక్టర్లను బదిలీ చేస్తూ మల్టీ జోన్ –1ఐజీ ఏవీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజేశ్వర్ రావుకు మరోచోట పోస్టింగ్ దక్కలేదు. ఆయన్ను మల్టీ జోన్ –1 ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భూపాలపల్లిలో ఇన్నాళ్లు ఖాళీగా ఉన్న డీసీఆర్ బీ ఇన్ స్పెక్టర్ గా ఎస్ రమేష్ నియమితులయ్యారు.

# చోరీ కేసును చేధించిన పోలీసులు

అక్షర దర్బార్, హైదరాబాద్: ఇటీవల మేడ్చల్‌లో పట్టపగలే నగల దుకాణంలో యజమానిని కత్తితో పొడిచి దోపిడీకి పాల్పడిన ఘటనలో మేడ్చల్ పోలీసులు 24 గంటల్లో కేసును ఛేదించారు. సీసీ పుటేజీ ఆధారంగా పోలీసులు నిందితులను పట్టుకున్నారు. అయితే, నిందితులకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, మేడ్చల్ పట్టణంలో గురువారం మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి.. ఒక వ్యక్తి బురఖా వేసుకుని.. మరోవ్యక్తి హెల్మెట్ పెట్టుకుని నగల దుకాణంలోకి చొరబడ్డారు. బురఖా వేసుకున్న వ్యక్తి కత్తితో బెదిరిస్తూ యజమాని శేషారాంను బంగారం, వెండి నగలు ఇవ్వాలని హెచ్చరించాడు. ఈ క్రమంలోనే యజమాని హతాశుడై చూస్తుండగానే కుడివైపు ఛాతిపై పొడిచాడు. హెల్మెట్ పెట్టుకున్న వ్యక్తి కౌంటర్ లోపల ప్రదర్శనకు ఉంచిన నగలను బ్యాగులో వేసే ప్రయత్నం చేస్తుండగా, శేషారాం తప్పించుకొని బయటికొచ్చి అరిచాడు. దీంతో దొంగలు భయపడి బైక్ పై పారిపోయారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

# రాష్ట్రంలో ఎకో టూరిజం ప్రణాళిక..

- పర్యావరణం, వన్య ప్రాణులకు హాని లేకుండా రూపకల్పన
- ఇప్పటికే 40 ఎకో టూరిజం స్పాట్ల గుర్తింపు
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

అక్షర దర్బార్, హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఏకో టూరిజం (ప్రకృతి పర్యాటకం) అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నదని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. పర్యావరణానికి, వన్య ప్రాణులకు ఏ మాత్రం హాని కలగకుండా, వాటి సహజ ఆవాసాలను పరిరక్షిస్తూ, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూ ఎకో టూరిజం పాలసీని అభివద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని మంత్రి సురేఖ తెలిపారు. శనివారం డా.బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం లోని అటవీ మంత్రిత్వశాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎకో టూరిజం కన్సల్టేటివ్ కమిటి ఛైర్మన్, మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, ఎకో టూరిజం అభివద్ధి కార్యక్రమాల ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సరికొత్తగా ఆవిష్కరించనున్నామని మంత్రి సురేఖ అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 12 సర్క్యుట్‌లలో 40 ఎకో టూరిజం స్పాట్లను గుర్తించినట్లుగా మంత్రి తెలిపారు.

అడ్వెంచర్, రీక్రియేషన్, ఆధ్యాత్మిక, వారసత్వ, సినీ, వెడ్డింగ్, నేచర్ అండ్ వైల్డ్ లైఫ్, హెరిటేజ్ అండ్ కల్చర్ తదితర అంశాల ఆధారంగా మరిన్ని ప్రాంతాలను గుర్తించి వాటిని ఎకో టూరిజం స్పాట్లుగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. ఎకో టూరిజం పాలసీ రూపకల్పనలో అటవీ, దేవాదాయ, రెవెన్యూ, పర్యాటక శాఖలను సమన్వయం చేసుకుంటూ, అడ్డంకులను అధిగమించుకుంటూ సాగాలని అటవీ అధికారులకు సూచించారు. ఆర్కియాలజీ శాఖతో సంప్రదింపులు జరిపి రాష్ట్రంలోని చారిత్రక ప్రదేశాల్లో పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. గత ప్రభుత్వం ఎకో టూరిజం పాలసీ రూపకల్పన పేరుతో కాలయాపన చేసిందని మంత్రి విమర్శించారు. ఒడిషా, కర్నాటక రాష్ట్రాల్లో అమలవుతున్న ఎకో టూరిజం విధానాలను అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఆ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు గమనించిన పరిస్థితులను ఇక్కడి పరిస్థితులతో బేరీజు వేసుకొని అత్యుత్తమ ఎకో టూరిజం పాలసీల రూపకల్పనకు కషి చేయాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు.

గతంలో జరిగిన సమావేశంలో ఆహ్లాదకరమైన అటవీ ప్రాంతాలు, వన్యప్రాణుల, వలస పక్షుల ఆవాసాలు, జీవవైవిధ్య ప్రాంతాలు, వారసత్వ కట్టడాలున్న ప్రాంతాల్లో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించిన విషయాన్ని మంత్రి సురేఖ అధికారులకు గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎకో టూరిజం స్పాట్లను అభివృద్ధి చేసేందుకు పిపిపి పద్ధతిలో నిధులను సమీకరించాలని, రాష్ట్రంలోని ప్రధాన నది అయిన గోదావరి నదీపరివాహక ప్రాంతంలోనూ, జలపాతాలు, నీటివనరులన్న ప్రాంతాల్లో ఎకో టూరిజం స్పాట్లను అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా పథకాలు రచించాలని, ఎకో టూరిజం స్పాట్లకు సంబంధించిన సమస్త సమాచారాన్ని వెబ్‌సైట్లలో ఉంచాలన్నారు. పూర్తిస్తాయిలో ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని కల్పించాలని, ఆయా పర్యాటక ప్రదేశాల్లో స్థానికులకు, మహిళా సంఘాలకు ఉపాధిని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో స్టాళ్ళు ఏర్పాటు చేయాలని, సామాజిక బాధ్యతగా ఎకో టూరిజం స్పాట్లకు సెలబ్రిటీల ద్వారా ప్రచారం కల్పించాలని తెలిపారు. మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్వహణ ఉండాలని, ప్లాస్టిక్ ఫ్రీ పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ ఏ చిన్న ప్రాణికి కూడా హాని కలగని విధంగా ఎకో టూరిజం పాలసీ రూపకల్పనను చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులకు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎకో టూరిజం పాలసీని రూపొందించే దిశగా కన్సల్టేటివ్ కమిటి ఒకడుగు ముందుకు వేసిందని ఈ సమావేశంలో క్రోడీకరించిన సమాచారాన్ని సీఎం దృష్టికి తీసుకుపోయి విధివిధానాలు ఖరారు చేసిన తర్వాత మరోమారు కన్సల్టేటివ్ కమిటి సమావేశమవుతుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కన్సల్టేటివ్ కమిటి మెంబర్లు అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పిసిసిఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్, పిసిసిఎఫ్ (వైల్డ్ లైఫ్) పర్గెయిన్, పిసిసిఎఫ్ (కంపా) సువర్ణ, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా, స్టేట్ డైరక్టర్ ఫరీదా తంపల్, తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ రంజిత్ నాయక్, జాయింట్ సెక్రటరీ హరిత, డిప్యూటీ సెక్రటరీ(అటవీ) శ్రీలక్ష్మి , సీసీఎఫ్ క్షితిజ, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ ఛైర్మన్ ఇమ్రాన్ సిద్దిక్, ఎండోమెంట్స్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ జీఎం ఉపేందర్ రెడ్డి, సీఐఐ మెంబర్ శ్రీ దేవి రావు, డిఎఫ్ఓ శివ ఆశిష్ సింగ్, నవీన్ రెడ్డి, సిద్ధార్థ్ వి సింగ్, కిష్టా గౌడ్, రాహుల్ కె జాదవ్ ఉన్నారు.

## మంత్రిని కలిసిన చాంబర్ ప్రతినిధులు

**- మార్కెట్ సమస్యలపై వినతి**

అక్షర దర్బార్, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాదులో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు కలిశారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్ లో పేరుకుపోయిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కొండా సురేఖ మార్కెటింగ్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, ఛాంబర్ జాయింట్ సెక్రటరీ సాగర్ల శ్రీనివాస్, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎన్ రెడ్డి లింగారెడ్డి, కాటన్ సెక్షన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, కోల్డ్ స్టోరేజీ సెక్షన్ అధ్యక్షుడు కంభంపాటి శ్రీధర్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## 'సీఎస్ఐఆర్ - యూజీసీ' నెట్ పరీక్ష వాయిదా..

అక్షర దర్బార్, హైదరాబాద్: 'సీఎస్ఐఆర్ – యూజీసీ' నెట్ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. జూన్ 25 నుంచి 27 వరకు జరగాల్సి ఉన్న ఈ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు శుక్రవారం సాయంత్రం వెల్లడించింది. కొన్ని అనివార్య పరిస్థితుల వల్ల పరీక్షను వాయిదా వేయక తప్పడం లేదని ఎన్టీఏ తెలిపింది. పరీక్షను మళ్లీ నిర్వహించే తేదీలను త్వరలోనే సంస్థ అధికారిక వెబ్‌సైట్ వేదికగా ప్రకటిస్తామని చెప్పింది. ఈ అంశంపై సందేహాలున్న విద్యార్థులు హెల్ప్ లైన్ నంబర్లు 011- 40759000, 011-69227700 లేదా [email protected] అనే మెయిల్ ఐడీ ద్వారా తమను సంప్రదించాలని ఎన్‌టీఏ కోరింది. ఈనెల 18న జరిగిన యూజీసీ నెట్ పరీక్షను.. మరుసటి రోజే రద్దు చేసిన సంగతి తెలిసిందే. నెట్ పరీక్ష ప్రశ్నపత్రం జూన్ 16నే లీకైందని సీబీఐ ప్రాథమిక దర్యాప్తులో తేలినందున.. తదుపరిగా షెడ్యూల్ చేసిన నెట్ పరీక్షలను కూడా ఎన్‌టీఏ వాయిదావేసింది.

## రెండు రోజులు నీటి సరఫరా బంద్

అక్షర దర్బార్, వరంగల్: వరంగల్ దేశాయిపేట ప్రతాప రుద్ర ఫిల్టర్ బెడ్ పరిధిలో పైపు లైన్ మరమత్తు పనులు కొనసాగుతున్నందున రెండు రోజులు (సోమ, మంగళ వారం) నీటి సరఫరా ఉండదని, ఈ ఫిల్టర్ బెడ్ పరిధిలోని ప్రాంతాల ప్రజలు సహకరించాలని బల్దియా ఈ ఈ శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఫిల్టర్ బెడ్ పరిధిలోని ప్రాంతాలైన దేశాయిపేట, కొత్తవాడ, ఆటోనగర్, పోచమ్మ మైదాన్ ఎల్బీ నగర్, కాశీబుగ్గ, కంటి హాస్పిటల్, ఎంజీఎం ఆసుపత్రి ఏరియా, కేఎంసి, మట్టెవాడ, వరంగల్ చౌరస్తా, బట్టలబజార్, సంతోషి మాతా కాలనీ ఏరియా, హంటర్ రోడ్, చార్ బౌలి గోవింద రాజులగుట్ట, క్రిస్టియన్ కాలనీ, లేబర్ కాలనీ, ఎస్ ఆర్ టి, ఎనుమాముల, ఆరేపల్లి, కొత్తపేట, గొర్రెకుంట, కీర్తి నగర్, పైడిపల్లి, మొగిలిచర్ల, ధర్మారం ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని, ప్రజలు గమనించి సహకరించాలని ఈఈ కోరారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

**పీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి**

**సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం**

అక్షర దర్బార్, నెక్కొండ : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని పీసీసీ సభ్యుడు రంజిత్ రెడ్డి అన్నారు. రైతు రుణమాఫీపై కేబినెట్ ఆమోదం తెలిపిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం సీఎం రేవంత్ రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రైతులందరికీ అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రావుల హరీష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

**సంగెంలో..**

అక్షర దర్బార్ సంగెం : రైతు రుణమాఫీపై కేబినెట్ ఆమెదాన్ని హర్షిస్తూ సంగెం మండల కేంద్రంలో ఎంపీపీ కందగట్ల కళావతి నరహరి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవ రెడ్డి, పరకాల అధికార ప్రతినిధి జనగాం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, సీనియర్ నాయకులు గుమ్మడి హరిబాబు, గూడ సంపత్ రెడ్డి, ఎంపీటీసీలు గుగులోతు వీరమ్మ, కట్ల సుమలత నరేష్, చిదురాల రజిత రాజు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆగుపాటి రాజు, మండల మహిళా అధ్యక్షురాలు బిక్కిరెడ్డి సంధ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండేటి రాజకుమార్, మైనార్టీ అధ్యక్షులు ఎండీ పాషా, ఎస్టీ సెల్ అధ్యక్షుడు గూగుల్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సంగెంలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కళావతి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర టీఎస్

# సమస్యలపై దృష్టి సారించాలి

- క్షేత్ర స్థాయిలో పర్యటించి నివేదికలు రూపొందించాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

అక్షర దర్బార్, ములుగు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు క్షేత్ర స్థాయిలో దృష్టి సారించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ తన చాంబర్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 9 మండలాల్లోని ప్రతి గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలు, ఉపాధి వనరులపై నివేదికలు రూపొందించాలన్నారు. గ్రామాల్లో ప్రధాన సమస్యలు, గ్రామీణ ప్రాంత వనరులు, వారి జీవన ఉపాధి, గ్రామస్తుల ప్రధాన అవసరాలు, విద్య, ఆరోగ్యం, పౌష్టిక ఆహారం, స్కిల్ డెవలప్‌మెంట్, వ్యవసాయం, హార్టికల్చర్, పశుపోషణ, మత్స్య సంపద వంటి అన్ని రంగాల వివరాలు నివేదికలో పొందుపరిచి సమర్పించాలని సూచించారు. కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి.శ్రీజ, డీఆర్డీవో శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్ఓ అప్పయ్య, డీడబ్ల్యూవో స్వర్ణలత, డీఈవో పాణిని, డీసీవో సర్దార్‌సింగ్, మత్యశాఖ అధికారి శ్రీపతి, డీఏవో విజయ చంద్ర, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

## రామప్ప అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని ములుగు కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ తన చాంబర్‌లో పురావస్తు శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ప్రసాద్ స్కీంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను పురావస్తు శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రసాద్ స్కీంలో భాగంగా 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.61.99 కోట్ల వ్యయంతో నిర్మాణం జరుగుతున్న ఇంటర్ ప్రిటేషన్ సెంటర్ పనులను వేగవంతం చేయడంతో పాటు రామప్ప దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్నారు. రామప్పకు వచ్చే పర్యాటకుల కోసం స్టాల్స్, ఫుడ్ కోర్ట్స్, పార్క్, ఆడిటోరియం, టాయిలెట్స్, బ్యాటరీ వెహికిల్స్ వంటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. యునెస్కో నిబంధనల ప్రకారం దేవాలయం పరిసరాల్లో శివాలయం, గొల్లగుడి ఒకే ప్రాంగణంలో ఉండాలని వాటికి సంబంధించిన స్థల సర్వేలు నిర్వహించాలని పురావస్తు శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కేంద్ర పురావస్తు శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రోహిణి పాండే అంబేద్కర్, జిల్లా పురావస్తు శాఖ అధికారి యం.మల్లేష్, సర్వేయర్ ప్రశాంత్, ఏఈ విజయ్, క్షేత్ర ఫౌండేషన్ సూర్యనారాయణమూర్తి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శివకుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

## క్యాన్సర్ బాధితులకు కేంద్రం ఆర్థిక భరోసా..

**జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్**

అక్షర దర్బార్, హన్మకొండ : క్యాన్సర్ బాధితులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక భరోసానిస్తోందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డితో కలిసి వైద్య, ఆరోగ్య, గిరిజన హాస్టల్స్ తదితర అంశాలపై డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివ రావు, వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ క్యాన్సర్ పేషెంట్ల కోసం కేంద్ర ప్రభుత్వం పథకాన్ని తీసుకువచ్చిందని, ఈ పథకం ద్వారా క్యాన్సర్ వైద్యానికి రూ.పదిహేను లక్షలు అందజేస్తుందని అన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల జిల్లా అధికారులు, వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎంజీఎం ఆసుపత్రి లో రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని, వైద్యం కోసం వచ్చే వారికి భరోసా కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత నివ్వాలని పేర్కొన్నారు. గిరిజన హాస్టళ్లలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలన్నారు. విద్యార్థుల కోసం అవసరమైతే సీట్లు, రూమ్ ల సంఖ్యను పెంచేవిధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. అదేవిధంగా గిరిజన బంజారా భవన్లో సౌకర్యాలను మెరుగుపర్చాలని అన్నారు. కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్, ప్రభుత్వ ఛాతి ఆసుపత్రి ఇంచార్జి డాక్టర్ రవి, పరకాల ఆసుపత్రి వైద్యులు గౌతమ్ చౌహాన్, డీటీడీవో ప్రేమకళ, ఆర్సీవో డీఎస్ వెంకన్న, ఆర్ అండ్ బీ డీఈ రాజు, హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**ఏఐఎఫ్డీఎస్ వరంగల్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్**

అక్షర దర్బార్, నర్సంపేట : పర్మిట్ దాటిన ప్రైవేటు స్కూళ్ల వాహనాలపై నిఘా పెట్టి ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలనిఏ ఐఎఫ్డీఎస్ వరంగల్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్ అధికారులను కోరారు. శనివారం నర్సంపేట పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అమ్ముతున్నారని.. అధికారులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజ్, కొత్తకొండ రాజమౌళి, కళ్లపల్లి రాకేష్, కొత్తకొండ అజిత్, సాంబారి అజయ్ పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

అక్షర దర్బార్, హనుమకొండ : రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని స్టేషన్‌ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం హన్మకొండలోని తన నివాసంలో రఘునాథ పల్లి మండలం వెల్ది గ్రామానికి చెందిన కొయ్యడ రచన చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2.50లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని అన్నారు. ఆరోగ్య శ్రీ లో వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు వైద్యానికి అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సకు తగిన ఆర్థిక సాయం బాధితులకు అందిస్తోందని అన్నారు. రచన అనారోగ్యంతో బాధపడుతున్న విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.

### ఎంపీని కలిసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య శనివారం హన్మకొండలోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి చిందు యక్షగాన కళాకారుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను సత్కరించారు. గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ అవార్డు రావడం జనగామ జిల్లాకే గర్వకారణమని, ఆయనకు అన్ని విధాల అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనగామ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న ఎంపీ కావ్య

గుడుంబాను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు..

అక్షర దర్బార్, మల్హర్ : మండలంలోని గాదంపల్లి, దుబ్బపేట గ్రామాల్లో గుడుంబా స్టావరాలపై కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్ ఆధ్వర్యంలో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో అక్రమంగా గుడుంబా తయారీ, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వడ్లకొండ నరేష్ హెచ్చరించారు.

## అర్జీలను వెంటనే పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి**

అక్షర దర్బార్, వరంగల్ : ప్రత్యేక గ్రీవెన్స్ లో స్వీకరించిన ఆర్జీలను వెంట వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి అన్నారు. జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఆదేశాల మేరకు శనివారం దివ్యాంగులకు, వయోవృద్ధులకు ప్రత్యేక ప్రజావాణి నిర్వహించారు. అదనపు అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి మధురిమ దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రీవెన్స్ లో జిల్లా నలుమూలల నుండి వచ్చిన దివ్యాంగులు, వృద్ధులు పలు రకాల సమస్యలపై 15దరఖాస్తులను సమర్పించారు. అందులో 5 అర్జీలు ఉపాధి కల్పన శాఖ, 3–డీఆర్డీవో, 3–సంక్షేమశాఖ, 2–పోలీస్ శాఖ, 1–ఎస్సీ కార్పొరేషన్, 1– జిడబ్ల్యూఎంసీకు సంబందించినవి ఉన్నాయని అధికారులు తెలిపారు.

ఆర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్